క్లుప్తంగా

ఈవెంట్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టాలి

- డీఆర్‌డీఓ నర్సింహులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఈవెంట్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టాలని డీఆర్‌డీఓ నర్సింహులు అన్నారు. సోమవారం జిల్లా మహిళా సమాఖ్య భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు నైపుణ్యం ఉన్న ఈవెంట్లను పెట్టుకోవడానికి ప్రభుత్వం అంగీకరించిందని, వాటిపై దృష్టి పెట్టాలన్నారు. ఇందులో భాగంగా డేకరేషన్, వీడియో గ్రాఫిక్, ఫొటో గ్రాఫిక్, మ్యూజిక్ సిస్టం లాంటి ఈవెంట్లను పెట్టుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రజిత, కార్యదర్శి సుమతి, కోశాధికారి అనిత, డీఆర్‌డీఏ ఏపీడీ జోజప్ప, డీపీఎంలు నాగమల్లిక, సలోమి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో పాఠశాలకు పేరు తేవాలి



జడ్చర్ల టౌన్: రాష్ట్రస్థాయి సీఎం కప్ 2024లో రాణించి పాఠశాలకు పేరు తీసుకురావాలని మండలంలోని కోడ్గల్ జెడ్పీహైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు హ్యాండ్ బాల్ క్రీడాకారులకు సూచించారు. సీఎం కప్ జిల్లాస్థాయిలో హ్యాండ్‌బాల్ పోటీల్లో విజేతగా నిలిచిన క్రీడాకారులను అభినందించారు. చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తేనే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. అభినందించిన వారిలో పీడీ రవికుమార్, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

క్రీడాకారుడికి సన్మానం

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రానికి చెందిన బాస్కెట్ బాల్ క్రీడాకారుడు రాజా రామ్ చరణ్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల కలకత్తాలో జరిగిన 39వ నేషనల్ బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్‌కు తెలంగాణ తరఫున రాజా రామ్‌చరణ్ పాల్గొన్నారు. జాతీయ స్థాయికి కౌకుంట్ల పేరును తీసుకు పోయిన రాజా రామ్‌చరణ్‌ను సామాజిక వేత్త షేక్ అబ్దుల్ జాంగీర్ ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. బాస్కెట్ బాల్ క్రీడలో ఇంకా ఉన్నత స్థానానికి తీసుకుపోయి రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు తేవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, బాలస్వామి, శాంతన్న పాల్గొన్నారు.

కార్మికులకు రూ.18వేల వేతనం ఇవ్వాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పెట్టినట్లు గ్రామ పంచాయతీలో పని చేసే కార్మికులకు నెలకు కనీస వేతనం కింద రూ.18వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి, గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 27, 28న నిర్వహించే సమ్మె నోటీస్‌ను సోమవారం డీపీఓ పార్థసారథికి యూనియన్ నాయకులు అందజేశారు.

వ్యక్తి అదృశ్యం

నవాబుపేట: ఇంటి నుంచి ఇప్పుడే వస్తానంటూ చెప్పిన వెళ్లిన వ్యక్తి పదిరోజులైన తిరిగి రాలేదు. దీంతో అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం కేసు నమోదైన సంఘటన చోటుచేసుకుంది. మండల పరిధిలోని తీగలపల్లి గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల లక్ష్మీనారాయణ(38) ఈ నెల 16న ఇంట్లో నుంచి ఇప్పుడే వస్తానంటూ చెప్పి బయటికి వెళ్లాడు. పది రోజుల పాటు బంధువుల వద్ద, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించక పోవడంతో అతని భార్య గీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

విద్యార్థి..

హన్వాడ: మండల కేంద్రానికి చెందిన పదో తరగతి విద్యార్థి బైకని నవీన్‌కుమార్ అదృశ్యమైనట్లు తండ్రి బైకని రాజు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు.. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి నవీన్‌కుమార్ ఈనెల 22న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో తండ్రి బైకని రాజు హన్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

పాఠశాల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

భూత్పూర్: మండలంలోని మద్దిగట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని సోమవారం అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. పాఠశాలలో గణితశాస్త్రం ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉందని, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయ పోస్టు సైతం వేరే మండలానికి మార్చడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తమన్నగౌడ్, సురేష్, సూరయ్య, రాములు, పవన్, లక్ష్మయ్య, కురుమూర్తి, దాసు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డులో రోడ్డు స్థల వివాదం



స్థానికుల మధ్య వాగ్వాదం

- నిలిచిన డ్రెయినేజీ నిర్మాణం
- అన్ని పరిశీలించాకే పనులు చేపట్టాలని నిర్ణయం

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ యార్డు గంజ్ ప్రాంతంలో రోడ్డు సరిహద్దుల భూవివాదం ఏర్పడింది. దీంతో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4లక్షలతో చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులు నిలిపేశారు. అన్ని పరిశీలించి రోడ్డు విస్తరణ తేలాకే నిర్మాణ పనులు చేపట్టాలని చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డితో పాటు వార్డు కౌన్సిలర్లు నిర్ణయించారు. ఈ వివాదంపై కొందరు పెదవి విరుస్తున్నప్పటికి మెజార్టీ ప్రజలు హర్షిస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గంజ్ ఏర్పడిన నాటినుంచి రెండు దశాబ్దాల క్రితం వరకు వ్యాపారుల ఇళ్ల ముందు ధాన్యం రాసులు పోసేవారు. కాలక్రమేణా యార్డుకు ప్రహరీ నిర్మాణం చేపట్టారు. ప్రహరీ నుంచి వ్యాపారుల ఇళ్ల మధ్యలో 100అడుగుల రోడ్డు ఉండేలా స్థలం విడిచిపెట్టారు. కొంతకాలంగా ఆ స్థలం తమదేనంటూ వ్యాపారులు నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిని కొందరు వ్యతిరేకిస్తున్నప్పటికీ నిర్మాణాలు ఆపలేకపోయారు. దీనికి గ్రామపంచాయతీ, మున్సిపల్ సిబ్బంది అనుకూలంగా వ్యవహరించటం, రాజకీయ నాయకుల సహకారంతో అనుమతి పొందారనే విమర్శలున్నాయి. ఇటీవల ప్రారంభించిన బ్యాంక్ అధికభాగం రోడ్డు స్థలంలోనే నిర్మాణం చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. దీంతోపాటు ర్యాంప్‌లు, మెట్లు నిర్మాణాలు చేయటంతో రోడ్డు మరింత ఇరుకుగా మారింది. ఒక భారీ వాహనం వస్తే మరో వాహనం రాలేని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో 15వ వార్డు కౌన్సిలర్, ప్రస్తుత వైస్ చైర్‌పర్సన్ పాలాది సారిక 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4లక్షలతో డ్రెయినేజీ నిర్మాణానికి మార్కింగ్ వేసి భూమిపూజ చేయాలని చైర్‌పర్సన్, ఇతర కౌన్సిలర్లను ఆహ్వానించారు. అక్కడికి వచ్చిన చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కౌన్సిలర్లు ప్రతిపాదించినట్లుగా డ్రెయినేజీ నిర్మిస్తే గంజ్‌లోకి వెళ్లే రోడ్డు పూర్తిగా ఇరుకుగా మారుతుందని వ్యతిరేకించారు. కాల్వ నిర్మాణం ప్రతిపాదించినట్లుగా కాకుండా షెడ్ల లోపలినుంచి వేయాలని అనటంతో వివాదం మొదలైంది. ఒక్కసారి కాల్వ నిర్మాణం చేస్తే ఇక స్థలం హద్దులు నిర్ణయించినట్లే అవుతుందని, అందుకు సమ్మతించమని చైర్‌పర్సన్, వార్డు కౌన్సిలర్లు ప్రకటించారు. తమకు అన్ని అనుమతులు, డాక్యుమెంట్లు ఉన్నందునే నిర్మాణాలు చేశామని, ఇప్పుడున్నట్లుగానే కాల్వ నిర్మాణం చేపట్టాలని అక్కడి వారు డిమాండ్ చేశారు. దీంతో కొద్దిసేపు మార్కెట్‌లో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. దానికి పాలకవర్గం అంగీకరించలేదు. మార్కెట్ స్థలం నిర్ణయించాకే నిర్మాణం చేస్తామని చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ఖరాఖండిగా చెప్పారు. ఇదే విషయాన్ని మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి సైతం ధ్రువీకరించారు. యార్డు వద్ద ఉన్న ఇళ్ల కొలతల్లో వ్యత్యాసాలు ఉన్నాయని, అన్ని పరిశీలించి రోడ్డు విస్తీర్ణం నిర్ణయిస్తామని ఆయన వెల్లడించారు. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిద్దామని కొందరు నాయకులు అభిప్రాయపడుతున్నారు. మార్కెట్‌యార్డులో రోడ్డు స్థలం ఎంత ఉందో తేల్చాలని, అందుకు మున్సిపల్, మార్కెట్ పాలకవర్గం సమన్వయంతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. డ్రెయినేజీ కారణంగా యార్డులో స్థల వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని, రోడ్డు విశాలంగా ఉండేలా చూడాలని రైతులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై నిర్మించిన ర్యాంప్, మెట్లపైనే డ్రెయినేజీ నిర్మాణం కోసం వేసిన మార్కింగ్

సెమీ క్రిస్మస్ వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ క్రీస్తు బోధనలు విశ్వశాంతికి సోపానమన్నారు. కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరూ అన్ని పండుగలను కలిసి మెలిసి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, మీడియా కన్వీనర్ సీజే బెనహర్, ఎన్‌పీ.వెంకటేశ్, సిరాజ్‌ఖాద్రీ, ఖాజా అజ్మత్‌అలీ, మహ్మద్ అవేజ్, ఫైసల్ తదితరులు పాల్గొన్నారు.

యంబీ చర్చిలో సాంస్కృతిక కార్యక్రమాలు

జడ్చర్ల టౌన్: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా యంబీ బేతని చర్చిలో సోమవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన క్రీస్తు జననం నాటకం, నృత్యాలు ఆహూతులను అలరించాయి. చర్చి ప్రాంగణంలో ఏసుక్రీస్తు జన్మించిన పాక నమూనా సైతం చూపరులను ఆకట్టుకుంటోంది. పట్టణంలోని చేయూత రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి హోసన్నాచర్చి పెద్దలు రె.రత్నకాంత్, ట్రస్టు అధ్యక్షుడు కారడి మార్త డేవిడ్‌లు క్రిస్మస్ కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.





జడ్చర్ల ఎంబీ చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన పాక

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట, బాబానగర్, బాలాజీనగర్, అల్మాస్ ఏరియా, ఇంద్రానగర్, శ్రీనివాస కాలనీలకు మంగళవారం ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోనూ వి ద్యుత్ సరఫరా ఉండదన్నారు. 11కేవీ ఫీడర్ మరమ్మతుల కోసం అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 16వార్డులో ఎస్‌బీఐ బ్యాంకు పక్కన రూ.4లక్షలతో నిర్మించనున్న మురికి కాల్వ నిర్మాణ పనులకు చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత సోమవారం భూమిపూజ చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో కాల్వ నిర్మాణ పనులు చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలో ని 5వ వార్డు పందిరిగుట్ట వద్ద చెత్త సేకరణ, శుద్ధి కేంద్రం కోసం స్థల పరిశీలన చేశారు. స్థల పరిశీలనలో కమిషనర్ లక్ష్మారెడ్డి ఉన్నారు.

నర్సరీల్లో మట్టి పనులు

నవాబుపేట: గ్రామాల్లో ఉన్న నర్సరీలలో మట్టి పనులు వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. సోమవారం ఆయన పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతూ నర్సరీలలో బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తి చేసి మొక్కల పెంపకానికి సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల టార్గెట్ ప్రకారం గ్రామానికి 10 వేల చొప్పున బ్యాగ్ ఫిల్లింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. దీనికి సంబంధించి పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు మండల అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

నీటి వినియోగంపై తహసీల్దార్‌కు వినతి

చిన్నచింతకుంట: చెరువుకు గండికొట్టి అక్రమంగా నీటిని వినియోగించుకున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండలంలోని అల్లీపురం గ్రామ మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ ఎల్లయకు వినతి పత్రం అందజేశారు. అల్లీపురం చెరువును ఆధారం చేసుకోని గ్రామానికి చెందిన 50 మత్స్యకార్మిక కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయని తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటేశ్వరెడ్డి అక్రమంగా చెరువు తూము కింద గండికొట్టి చెరువు నీటిని పంట పొలానికి వినియోగించుకున్నాడని తెలిపారు. దీంతో చెరువులో నీరంత వెళ్లి పోయిందని, చేపలు మొత్తం పంటపొలాలకు చేరి చనిపోయాయన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతు శ్రేయస్సే లక్ష్యం

- డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్యయ్య



గండేడ్: రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని హైదరాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కొత్తకుర్మ సత్యయ్య పేర్కొన్నారు. సోమవారం మహమ్మదాబాద్ డీసీసీబీ బ్యాంకు, గండేడ్ పీఏసీఎస్‌లను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని రైతు చింతకింది రాములును శాలువాతో సన్మానించారు. అనంతరం రైతులే సమాజానికి వెన్నముక అని, వారు అన్ని రకాలుగా ఆర్థికాభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గండేడ్ పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, డీజీఎం కిరణ్‌కుమార్, మేనేజర్ వెంకటయ్య, సూపర్‌వైజర్ శ్రీహరి, గున్న నారాయణ, బసిరెడ్డి పాల్గొన్నారు.

రైతులకు సన్మానం

జడ్చర్ల టౌన్: జాతీయ రైతు దినోత్సవం పురస్కరించుకుని సోమవారం బాదేపల్లి మార్కెట్ యార్డులో రైతులను ఘనంగా సత్కరించారు. యార్డు ప్రాంగణంలో రైతులను పూలమాల, శాలువాలతో యార్డు చైర్‌పర్సన్ జ్యోతి సత్కరించి రైతు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రైతులు బాగుంటేనే గ్రామాలు, రాష్ట్రం, దేశం బాగుంటుందన్నారు.మార్కెట్ కార్యదర్శి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

కోయిల్‌కొండ: విద్యార్థులు చదువుకుంటేనే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలని గూంజ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు వరదాసు అన్నారు. సోమవారం మండలంలోని పారుపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గూంజ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా పుస్తకాలు, బ్యాగులు, పెన్నులు, టాయ్స్‌గేమ్స్ మెటీరియల్ పంపిణీ చేశారు. పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర, హెచ్‌ఎం మొగులయ్య, అరుణ, రాజేశ్వరి, పర్వీనబేగం పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

జడ్చర్ల టౌన్(బాలానగర్): మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. 16 గ్రామాలకు చెందిన 50మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం దేవునిగుట్టతండలో రూ.1కోటీ నిధులతో నిర్మిస్తున్న బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. తిమ్మారెడ్డిపల్లిలో రూ.1.13కోట్లతో నిర్మిస్తు న్న బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, అధికారులు ఉన్నారు.

రైతు సంక్షేమం కోసం కృషి

- మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత



వ్యవసాయ మార్కెట్ యార్డులో సిబ్బందిని సన్మానించిన చైర్మన్ బెక్కరి అనిత

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): అప్పుల పాలైన రాష్ట్రంలో ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతు సంక్షేమానికి మొదటి ప్రాధాన్యతగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత అన్నారు. సోమవారం వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీలో పనిచేసే సిబ్బందిని శాలువాతో సత్కరించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు నిలబడే పంటలు సాగు చేస్తే భవిష్యత్‌లో మేలు జరుగుతుందని తెలిపారు.

విద్య, వైజ్ఞానిక మహాసభల పోస్టర్ విడుదల

సాక్షి, నెట్‌వర్క్: టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 6వ విద్యా, వైజ్ఞానిక మహాసభల పోస్టర్‌ను ధర్మాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎంఈఓ కృష్ణయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రవికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో అక్తర్ హుస్సేన్, అంజిలయ్య, ఇవి శర్మ, శాంతాబా యి, వెంకటయ్య, శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి, నర్సప్ప, మధుసూదన్, కల్యాణి, శ్రీరాములు, జగదీష్‌గౌడ్, అరుణ, హన్మంతు, మల్లేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

■ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేష్ పిలుపునిచ్చారు. అడ్డాకుల మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద మహాసభల వాల్‌పోస్టర్‌ను ఎంఈఓ కురుమూర్తితో ఆవిష్కరించారు.

■ మిడ్జిల్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మహాసభల పోస్టర్‌ను ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నర్సింహులు, ఎంఈఓ సుధాకర్, మండల అధ్యక్షులు వెంకటయ్యలు విడుదల చేశారు.



అడ్డాకులలో మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంఈఓ, నాయకులు

■ గండేడ్ మండల కార్యదర్శి బోరు కృష్ణయ్య, ఎంపీడీఓ దేవన్న, ఎంఈఓ జనార్దన్‌లు చి న్నవార్వాల్‌లో మహాసభల పోస్టర్ విడుదల చేశారు.

■ మహాసభల వాల్‌పోస్టర్‌ను బాదేపల్లి జెడ్పీహైస్కూల్‌లో హెచ్‌ఎం లక్ష్మి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి నరేష్, జిల్లా కార్యదర్శి మణ్యం ఉన్నారు.

అధికారులకు ఒకటే ఫిర్యాదు

నవాబుపేట: ప్రజల సమస్యలపై ప్రతి సోమవారం అధికారులకు అందించే ప్రజా వినతుల దినోత్సవం సందర్భంగా ఒకటే ఫిర్యాదు అందిందని ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులందరు వేచి ఉన్న తరుణంలో మధ్యాహ్నం సమయంలో పంచాయతీరాజ్‌కు సంబంధించి రోడ్ల కోసం ఒక ఫిర్యాదు అందిందని ఆయన తెలిపారు. వరుసగా రెండు వారాలు ఫిర్యాదులు నిల్‌గా ఉండగా తాజాగా ఒక ఫిర్యాదు రావడం విశేషం. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, బద్రునాయక్ ఉన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ నాగం కుమారస్వామి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాజ్యాంగ రచయిత అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని పాలమూరు యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ నాగం కుమారస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు పీయూలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి రాజ్యాంగం స్ఫూర్తితో దేశం ఎంతో అభివృద్ధి సాధించిందని, అందుకు కారణం అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే అన్నారు. రాజ్యాంగ రచన సమయంలో అంబేడ్కర్ కృషి సాక్ష్యాత్తు రాజ్యాంగ సభ సభ్యులు సైతం కొనియాడారన్నారు. అమిత్‌షా దేశంలో గౌరవ ప్రదమైన స్థానంలో ఉండి ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సరైన విషయం కాదన్నారు. వెంటనే వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో భవిష్యత్‌లో పెద్ద ఎత్తున నిరసన చేపడతామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు కిషోర్, అర్జున్‌కుమార్, జిమ్మికార్టన్, పర్వతాలు, మధు, రవీందర్, విజయ భాస్కర్, రవికాంత్ పాల్గొన్నారు.

గణిత మేళా

జడ్చర్ల టౌన్: పట్టణంలోని సరస్వతి శిశుమందిరంలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకుని సోమవారం గణిత మేళా నిర్వహించారు. మేళా పురస్కరించుకుని చతుర్విధ ప్రక్రియలు, కూడికలు, తీసివేతలు, గుణకారం, గణిత ఆకారాలు, పట్టికల ప్రదర్శనలు ఆకర్షించాయి. ముచ్చర్ల శ్రీకాంత్ హాజరై ప్రసంగించారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటాం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి

నవాబుపేట: బీఆర్‌ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని యన్మన్‌గండ్ల గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఖాజామైనొద్దీన్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహులు, రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, నాగిరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, ప్రతాప్, చెన్నయ్య, శ్రీనివాస్, హన్మంతు, గోపాల్‌గౌడ్, అబ్దుల్లా, నర్సింహులు, శ్రీశైలం ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న లక్ష్మారెడ్డి

'పీవీ' సేవలు మరువలేనివి

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



పీవీ నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్/అడ్డాకుల: భారత మాజీ ప్రధాన మంత్రి పీవీ నర్సింహారావు దేశానికి చేసిన సేవలు మరువలేనివని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అ న్నారు. మూసాపేట మండలం జానంపేటలో మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం పీవీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బగ్గి కృష్ణయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, బోయ కృష్ణయ్య, గోవర్ధన్ సాగర్, రాజేందర్‌రెడ్డి, చెన్నమ్మ, రాంకుమార్, సురేష్, ఉన్నారు.

■ అడ్డాకుల మండల కేంద్రంలో పీవీ నర్సింహారావు వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

■ దేశంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ఘనత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకే దక్కిందని పలువురు కాంగ్రెస్ నేతలు అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పీవీ నరసింహారావు ప్రపంచస్థాయి నాయకుల్లో చెప్పుకోదగ్గ వారన్నారు. ఆయన ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణ ఫలితాలు ప్రస్తుతం దేశప్రగతికి కీలకంగా మారాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నాయకులు ఎన్‌పీ. వెంకటేశ్, సిరాజ్‌ఖాద్రీ, జహీర్ అఖ్తర్, అజ్మత్‌అలీ, అవేజ్ పాల్గొన్నారు.

పట్టించుకునే వారు లేరు?



ప్రార్థన చేయిస్తున్న ఉపాధ్యాయురాలు, నర్సు

మహమ్మదాబాద్: ఓ వైపు ఉపాధ్యాయులు సమ్మెలో ఉన్నారు. తాత్కాలికంగా కేటాయించిన ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారు. కనీసం ప్రార్థన సమయానికి కూడా రాకపోవడంతో ప్రార్థన చేయించేవారు కరవయ్యారు. దీంతో విద్యార్థుల భవిత ప్రశ్నార్థకంగా మారింది. ఈ పరిస్థితి మహమ్మదాబాద్ కేజీబీవీలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఉమ్మడి గండేడ్ మండలానికి సంబంధించి మహమ్మదాబాద్‌లో కేజీబీవీ ఏర్పాటు చేశారు. ఇందులో ఆరు నుంచి ఇంటర్ వరకు ఉంది. సుమారు 500 మంది విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. ఇటీవల ఇందులో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమ్మె బా టపట్టారు. విధులకు హాజరుకావడం లేదు. దీంతో విద్యాశాఖ అధికారులు తాత్కాలికంగా ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను కేటాయించారు. వారు విధులకు ఇష్టారాజ్యంగా హాజరవుతున్నారు. ఉదయం ప్రార్థన తాత్కాలిక ఉపాధ్యాయులు చేయించాల్సి ఉండగా వారు సమయానికి రావడం లేదు. సోమవారం ఉదయం మాథ్స్ ఉపాధ్యాయురాలు, నర్సు ఇద్దరే విద్యార్థులకు ప్రార్థన చేయించారు. తాత్కాలిక ఉపాధ్యాయులు తరగతులు సరిగ్గా తీసుకోవడం లేదు. ఎప్పుడు పడితే అప్పుడు వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని కనీసం విద్యాబోధన సక్రమంగా జరిగేలా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ విషయమై సోమవారం ఎంఈఓ రాజునాయక్‌ను వివరణ కోరగా, కేజీబీవీ ఉపాధ్యాయుల స్థానంలో తాత్కాలికంగా ఏడుగురు ఉపాధ్యాయులను నియమించామన్నారు. వారే ఉదయం ప్రార్థన మొదలు సాయంత్రం వరకు పాఠాలు బోధించాలన్నారు. సమయపాలను పాటించాలని, లేకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.